క్లుప్తంగా

ఉరేసుకొని ఆత్మహత్య

నెల్లూరు రూరల్: చెట్టుకు ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యలమవారిదిన్నె సమీపంలోని పద్మావతి గ్రీన్‌సిటీ లేఅవుట్లో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై సమాచారం అందుకున్న వీఆర్వో గంగాధర్‌రావు అక్కడికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలియలేదు. నెల్లూరు రూరల్ పోలీసులకు వీఆర్వో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: గుర్తుతెలియని బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అల్లీపురం దళితవాడకు చెందిన కొండూరు మల్లికార్జున్ (50) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. నెల్లూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. అల్లీపురంలోని దళితవాడకు చెందిన మల్లికార్జున్, శేషమ్మ దంపతులు కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవారు. కూలీ పనులకు బుధవారం ఆయన వెళ్లారు. గుడిపల్లిపాడు నుంచి అల్లీపురానికి రాత్రి వేళ నడిచి వెళ్తున్న ఆయన్ను నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని బైక్ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో మల్లికార్జున్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహనచోదకుడు పరారయ్యారు. కుటుంబసభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చెన్నైకు తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. చికిత్సకు చెన్నైలోని వైద్యులు నిరాకరించగా, నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించాలని భావించారు. అయితే అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు రూరల్: వ్యక్తి అదృశ్యంపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. నారాయణరెడ్డిపేటకు చెందిన కొండా శంకర్ పేకాటకు బానిసై పలువురి వద్ద అప్పులు చేసి గతంలోనూ ఇంటి నుంచి పలుమార్లు వెళ్లి తిరిగొచ్చేవారు. తాజాగా ఆయన అదృశ్యంపై భార్య వెంకటసునీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ శుక్రవారంతో ముగిశాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి విజయ తెలిపారు. సాఫ్ట్ బాల్, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, సైక్లింగ్, సెపక్ తక్రా, రైఫిల్ షూటింగ్, యోగాకు సంబంధించిన ఎంపికలకు దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఈఓ గంగాభవానీ, క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ నాగరాజకుమారి, చీఫ్ కోచ్ యతిరాజ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వ్యాయామ, ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, థామస్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

నెల్లూరు(టౌన్): పదో తరగతిలో ఉత్తమ మార్కులను సాధించిన పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు పురస్కారాలను స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. 2022 – 23 విద్యాసంవత్సరంలో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున ప్రదానం చేశారు. డిప్యూటీ డీఈఓ ప్రసన్న లక్ష్మి, ఎంఈఓ – 2 మురళి, స్పందన ఫౌండేషన్ సెక్రటరీ సురేష్‌బాబు, మున్సిపల్ లీగల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు రంగారావు, తెలుగు సమాఖ్య అధ్యక్షుడు బలరామనాయుడు, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నెల్లూరు(బృందావనం): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కంచి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా సర్వరాజు శ్యామ్‌సుందర్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

నృసింహుడి సేవలో రాష్ట్ర విజిలెన్స్ అధికారి



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర విజిలెన్స్ అధికారి మూర్తి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వీరికి అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా నా భూమి - నా దేశం

పొదలకూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్లో నా భూమి – నా దేశం (మేరీ మాటీ – మేరా దేశ్) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. పవిత్రమైన మట్టితో కూడిన కలశాన్ని ప్రదర్శించారు. హెచ్ఎం సులూజారాణి, పీసీ చైర్మన్ శ్రీనివాసులు, మస్తానయ్య, పంచాయతీ సెక్రటరీ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ, బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూళ్లలో నా దేశం – నా భూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశభక్తులను స్మరిస్తూ ప్రత్యేక కలశాలను తయారు చేయించి పూలతో అలంకరించారు. అందులో మట్టిని నింపి విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓలు మధుసూదన, హేమసుందర్‌రావుకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాసులురెడ్డి, తాన్య తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరులో చిన్నారుల ర్యాలీ

కొడవలూరు: నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా కొడవలూరు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అమృత కలశంతో ర్యాలీని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీభవాని, ఉపాధ్యాయులు రమణమ్మ పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అమృత కలశంతో ర్యాలీని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మాధవి తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్లో..



ముత్తుకూరులో..



ఇందుకూరుపేటలో..

దళితుల మధ్య చిచ్చు పెట్టడాన్ని మానుకోండి

వెంకటాచలం: తన రాజకీయ ఉనికి కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టడాన్ని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మానుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నేత, ఇస్కపాళెం సర్పంచ్ అడపాల ఏడుకొండలు హితవు పలికారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాజకీయ రంగప్రవేశం చేసిన నాటి నుంచి కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా వాడుకోవడాన్ని ఆయన అలవాటుగా చేసుకున్నారని విమర్శించారు. టీడీపీలో అమాయకులైన దళిత నేతలతో సమావేశాలను పెట్టించి, అధికార పార్టీ నేతలను విమర్శించడం సరికాదని సూచించారు. మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఒక్క దళితుడికై నా ప్రాధాన్యం కల్పించారానని ప్రశ్నించారు. రాజకీయ పదవుల్లో అగ్రవర్ణాలతో పాటు దళితులకు సమప్రాధాన్యం కల్పిస్తున్న ఘనత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఏఎంసీ డైరెక్టర్ చీకుర్తి నరసయ్య, కసుమూరు సర్పంచ్ కడివేటి శివ, ఎస్సీ సెల్ జిల్లా నేత పైనం నరసయ్య, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మందా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

పౌష్టికాహార విలువలపై అవగాహన



బొడ్డువారిపాళెంలో సీమంతాలు



యల్లాయపాళెంలో అవగాహన ర్యాలీ

కొడవలూరు: బలవర్ధక ఆహారాన్ని గర్భిణులు తప్పక తీసుకోవాలని కోవూరు సీడీపీఓ జ్యోతి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని బొడ్డువారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార విలువలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు మధుసూదనమ్మ, సునీత, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

- పోషక విలువలపై అవగాహన కల్పిస్తూ మండలంలోని యల్లాయపాళెంలో ర్యాలీని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు

ముత్తుకూరు: మండలంలోని ఈపూరు పట్టపుపాళెంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. కాలనీలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించిన అనంతరం మాజీ సర్పంచ్ ఇసనాక చంద్రశేఖర్‌రెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి మాట్లాడారు. కాలనీలో 330 మీటర్ల మేర 12 అడుగుల వెడల్పున సీసీ రోడ్డును రూ.20 లక్షలతో నిర్మిస్తున్నారని చెప్పారు. పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఉపసర్పంచ్ బ్రహ్మానందం, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నేత్రపర్వంగా గణనాథుడి గ్రామోత్సవం

మనుబోలు: వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలకు గ్రామోత్సవాలను వేడుకగా గురువారం రాత్రి నిర్వహించారు. మనుబోలులోని తూర్పువీధి, కేఆర్‌పురం సీఎం నగర్, అరుంధతీవాడ, దళితవాడలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు.

తూర్పు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా, రూ.1.01 లక్షలకు జనార్దన్‌రెడ్డి దక్కించుకున్నారు. వినాయకుడి మెడలో అలంకరించిన నగదు మాలను రూ.40 వేలకు సొంతం చేసుకున్నారు. అనంతరం విగ్రహాలను గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.



పొదుపు సంఘాలకు చెక్కు అందజేత

కొడవలూరు: మండలంలోని మహిళా రైతులు, పొదుపు సంఘాల రుణాల చెల్లింపులు బాగున్నాయని ఎస్బీఐ క్రెడిట్, ఎస్ఎంఈ విభాగ చీఫ్ మేనేజర్ స్వరూప్ కొనియాడారు. రుణాలను పొంది సకాలంలో చెల్లిస్తున్న పొదుపు సభ్యులు, మహిళా రైతులకు సన్మాన కార్యక్రమాన్ని కొడవలూరులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రూ.15 కోట్ల రుణాలను అందజేయగా, అందులో రూ.మూడు కోట్లను కొడవలూరు మండలానికే మంజూరు చేశామని వివరించారు. పెద్ద మొత్తంలో రుణాలను పొందడంతో పాటు తిరిగి చెల్లించడంలో మండలంలోని మహిళా రైతులు, పొదుపు సంఘాలు ముందంజలో ఉన్నాయని తెలిపారు. వీరికి మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు ఎస్బీఐ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అనంతరం రుణాలను సకాలంలో చెల్లించిన మహిళా సంఘాల సభ్యులు, రైతులకు రూ.మూడు కోట్ల జంబో చెక్కును అందజేశారు. ఏపీఎం రుక్మిణి, సీసీలు ఉదయ్‌కుమార్, మమత, శోభ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గుంటరాజుపాళేనికి మంత్రి కాకాణి రాక నేడు

పొదలకూరు: మండలంలోని దుగ్గుంటరాజుపాళేనికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం పది గంటలకు రానున్నారని ఎంపీడీఓ నగేష్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి పాల్గొననున్నారని చెప్పారు. మండల స్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

విద్యార్థిని అదృశ్యం

వెంకటాచలం: విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని సర్వేపల్లికి చెందిన యువతి నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. కళాశాలకు బుధవారం వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు విద్యార్థిని తల్లి షర్మిల ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, మద్యం సీసాల చోరీ

- టీడీపీ నేతపై కేసు నమోదు

వెంకటాచలం: మద్యం షాపులోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడిన టీడీపీ నేతపై వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేటకు చెందిన టీడీపీ నేత బందనాదం జోషి సర్వేపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలోకి గురువారం రాత్రి దౌర్జన్యంగా ప్రవేశించారు. షాపులో పనిచేస్తున్న సేల్స్‌మెన్ మల్లింబాక పెంచలప్రదీప్ గమనించి బయటకెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో క్యాష్ కౌంటర్‌లో రూ.వెయ్యి నగదు, రెండు మద్యం బాటిళ్లను దోపిడీ చేశారు. అడ్డుకోబోయిన సేల్స్‌మెన్, సిబ్బందిని నెట్టేసి పరారయ్యారు. సేల్స్‌మెన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కొడవలూరు: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో మండలంలోని నార్తురాజుపాళెంలో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపేయనున్నామని వివరించారు.

ఘనంగా అమృత కలశ యాత్ర

నెల్లూరు(టౌన్): నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీనగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అమృత కలశ యాత్రను శుక్రవారం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఆయేషా, ప్రధానోపాధ్యాయుడు ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రామారావు, కో ఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు జోజీ పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. డాలర్ల రూపంలో రూ.92,166, ఇతర కానుకలతో కలిపి మొత్తం రూ.17,46,797 మేర లభించింది. అన్నదానానికి సంబంధించిన విరాళాలు రూ.33,534 మేర అందాయి. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యాన్ని అందించడమే లక్ష్యం

ఇందుకూరుపేట: పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనేదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందుకూరుపేటలోని ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఆయుష్మాన్‌భవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నారని తెలిపారు. ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు రూ.మూడు కోట్లను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మంజూరు చేయించారని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గునపాటి సురేష్‌రెడ్డి, వైద్యాధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

జొన్నవాడలో విశేష పూజలు

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం): జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి దేవస్థానంలో విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. అభిషేకాలు, పూజలు, మహా రుద్రహోమాలను జరిపారు. సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న రాధాకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



వారానికోసారి ఆరోగ్య మేళా

పొదలకూరు: ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా వారానికోసారి ఆరోగ్య మేళాను నిర్వహించనున్నామని పొదలకూరు సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో మేళాను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అక్టోబర్ రెండు వరకు మేళాలను నిర్వహించి పరీక్షలను చేపట్టనున్నామని వివరించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు. అనంతరం రోగులకు పరీక్షలను జనరల్ సర్జన్ శివకృష్ణ నిర్వహించారు. డాక్టర్లు పద్మావతి, నజ్మా సుల్తానా, నవీన్‌కృష్ణ, స్రవంతి, రాధ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇల్లు మంజూరుకు హామీ

మనుబోలు: మనుబోలులోని అరుంధతీయవాడలో గతంలో ప్రభుత్వం కట్టించిన పక్కా గృహంలో మల్లికార్జున నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పాతబడిన ఇంటి స్లాబ్ బుధవారం కూలిపోయింది. దీంతో వారి కుటుంబం వీధినపడింది. విషయం తెలుసుకున్న హౌసింగ్ ఏఈ రవికుమార్ బాధితుడి ఇంటికి శుక్రవారం వెళ్లి పరిశీలించారు. విషయాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కొత్త ఇల్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. చుట్టుపక్కల ఉన్న మహిళలు సైతం తమ ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాపోయారు. కాగా సమస్యను మంత్రికి తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శరత్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న రవికుమార్

ఆరోగ్య సురక్ష శిబిర ఏర్పాట్ల పరిశీలన

పొదలకూరు: మండలంలోని దుగ్గుంటరాజుపాళెంలో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను మండల స్థాయి అధికారులు శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చేరుకొని ఏర్పాట్లను తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబు, వైద్యాధికారులు కిరణ్ రిషిత, కావ్య, సిబ్బంది పర్యవేక్షించారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విస్తరణాధికారి రవికుమార్, పర్యవేక్షకులు మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుల నియామకం

కోవూరు / నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండలాధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది.

కోవూరు నియోజకవర్గం..

నలుబోలు సుబ్బారెడ్డి (కోవూరు), గోవర్ధన్‌రెడ్డి (విడవలూరు), వెంకటశేషయ్య (కొడవలూరు), మావులూరు శ్రీనివాసులురెడ్డి (ఇందుకూరుపేట), సతీష్‌రెడ్డి (బుచ్చిరెడ్డిపాళెం), టంగుటూరి మల్లికార్జున్‌రెడ్డి (బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ).

సర్వేపల్లి నియోజకవర్గం..

హరగోపాల్‌రెడ్డి (మనుబోలు), రమణారెడ్డి (పొదలకూరు), శంకరయ్యగౌడ్ (తోటపల్లిగూడూరు), మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి (ముత్తుకూరు), కొణిదెల మోహన్‌నాయుడు (వెంకటాచలం).



సుబ్బారెడ్డి



శ్రీనివాసులురెడ్డి



సతీష్‌రెడ్డి



గోవర్ధన్‌రెడ్డి



వెంకటశేషయ్య



మల్లికార్జున్‌రెడ్డి

వేడుకగా సత్యనారాయణ వ్రతం



వ్యాసరాజ మఠంలో..

నెల్లూరు(బృందావనం): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని సంతపేట బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలో గల సత్యనారాయణస్వామి మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు కృష్ణాచార్ ఆధ్వర్యంలో జరిపారు. సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, మందిర గౌరవ కార్యనిర్వాహకుడు అరవపల్లి సుబ్బారావు, మందిర మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు పాల్గొన్నారు.

- వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయ్‌కుమార్‌రెడ్డి, వాణిమల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ మందిరంలో..